చిన్నారులకు జేఈ టీకాలు వేయించాలి



దమ్మాయిగూడలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: మెదడు వాపు వ్యాధి రాకుండా 15 సంవత్సరాల లోపు పిల్లలందరికీ జేఈ టీకాలను వేయించాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 15 ఏళ్లలోపు పిల్లలకు కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జేఈ టీకాలు వేయించే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్ర సిబ్బంది మాట్లాడుతూ... ఆగస్టు 14వ తేదీ వరకు ఈ టీకాలు వేస్తామన్నారు. మండలంలోని భోగారం గ్రామంలో చిన్నారులకు జేఈ టీకాలు వేసే కార్య



ఘట్‌కేసర్‌లో పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావని

క్రమాన్ని కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రారంభించారు. కౌన్సిలర్ రామారం శ్రీహరిగౌడ్, ఏఎన్ఎంలు రేచల్, ఇందిర, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో...

ఘట్‌కేసర్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మెదడు వాపు నివారణ టీకాలు వేశారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య హాజరై టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్ఎం పాపిరెడ్డి, వైద్యురాలు విమల, జంగయ్యయాదవ్, సిరాజ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడికి పరామర్శ



బాలుడి తండ్రికి ఆర్థిక సాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో 4 వార్డులో గత బుధవారం కుక్కల దాడిలో గాయపడిన బాలుడు గగన్‌ను మున్సిపల్ చైర్ పర్సన్, నాయకులు, అధికారులు పరామర్శించారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి వద్దకు వెళ్లిన మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి గగన్‌ను కుక్కలు గాయపర్చిన తీరు పరిశీలించారు. బాలుడు తండ్రికి రూ. 15 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాలుడు పూర్తిగా కోలుకునే వరకు తమ సహకారం అందిస్తామని తెలిపారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్ బాలుడు కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల సాయం అందజేశారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

మేడ్చల్: సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న రాఘవేంద్రనగర్ కాలనీలో ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి అన్నారు. 3వ వార్డులోని రాఘవేంద్రనగర్ కాలనీలో కౌన్సిలర్ దేవతో కలిసి ఆయన పర్యటించారు. కాలనీలో బురద మయమైన రోడ్లను, ఇతర సమస్యలను ఆయన పరిశీలించారు. కౌన్సిల్‌లో చర్చించి అన్ని సమస్యలను సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. కాలనీలో రోడ్ల సమస్య, డ్రైనేజీ సమస్య, వీధి దీపాల సమస్య ఉందని, మంచినీటి సరఫరా అన్ని ఇళ్లకు చేయాలని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు.



రాఘవేంద్రనగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ దేవ

రోడ్డు భద్రతపై ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన



మాట్లాడుతున్న మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

శామీర్‌పేట్: ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పని సరిగా పాటించాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో హకీంపేటలోని ఆర్టీసీ డిపోలో బస్ డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు నిబంధనలపై వివరించారు. అనంతరం నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాలపై వీడియోలు, ఫొటోలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అమర జవానుల సేవలు చిరస్మరణీయం



కార్గిల్ విజయ్ దివస్‌లో పాల్గొన్న ఎల్‌వీ సుబ్రమణ్యం, వీఎం రెడ్డి, అన్నామలై

బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

మేడ్చల్‌రూరల్: కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవానుల త్యాగాలు, దేశానికి వారు అందించిన సేవలు చిరస్మరణీయమని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అన్నామలై, ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్.వి.సుబ్రమణ్యం, ఎయిర్ కమాండర్ వి.ఎం.రెడ్డి పేర్కొన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ గ్రూప్స్ ఆడిటోరియంలో 25వ కార్గిల్ విజయ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర సైనికుల కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశం కోసం, భావితరాల కోసం కార్గిల్ యుద్ధంలో శతృవులతో పోరాడి తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి వీరమరణం పొందిన 527 మంది త్యాగాలను దేశం ఎన్నటికీ మరిచిపోదన్నారు. సైనికుల త్యాగాల, వీరోచిత పోరాటాలతోనే మనమంతా దేశంలో ఎంతో ప్రశాంతంగా



జవానుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న సీఎంఆర్ గ్రూప్స్ చైర్మన్ గోపాల్‌రెడ్డి

ఉంటున్నామనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. సినిమాటోగ్రాఫర్ సెంథిల్‌కుమార్, మిస్ ఇండియా 2021 రన్నరప్ స్వాతి కుమార్, అమర జవానుల కుటుంబ సభ్యులు సునీత రాంచందర్, శారద గోపయ్య, అనురాధ రవిప్రసాద్, సీఎంఆర్ గ్రూప్స్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు, బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ తిరుపతిరావు, ప్రియాంక ధర్మపురి, శిల్పా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరోగ్య సంరక్షణ సదస్సు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ–వాణి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగిన ఆరోగ్య సంరక్షణ సదస్సు గురువారం ముగిసింది. సదస్సులో భాగంగా ఇంట్రడక్షన్ టు డీప్ లెర్నింగ్ అండ్ మెషిన్ లర్నింగ్, డీప్ లెర్నింగ్ ఫర్ కార్డియోవాస్కులర్ ఇమేజ్ అనాలసిస్ అంశాలపై అవగాహన కల్పించారు. డీప్ లెర్నింగ్ ఉపయోగించి హెల్త్‌కేర్‌లో మెడికల్ ఇమేజింగ్, డయాగ్నోసిస్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్‌పై వివరించారు. సదస్సులో ఆరోగ్య సంరక్షణ ప్రాయోజిత సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులకు ప్రిన్సిపాల్ లోకనాథం ప్రశంసాపత్రాలు అంద



ప్రశంస పత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్

జేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, డీన్‌లు రామసుబ్బారెడ్డి, దిలీప్‌కుమార్, శ్రీలక్ష్మి, శ్రీనివాస్, భద్రు, సునీల్‌కుమార్ ,అనూష, శోభన్ వరప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వరద వెళ్లేదెలా?

కార్పొరేషన్‌గా మారినా మారని జవహర్‌నగర్ పరిస్థితి	ఏళ్లు గడిచినా రోడ్లు, కాలువలు కరువు	చెరువులో కనిపించేలా గృహ సముదాయాలు	పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు	మెరుగుపడని డ్రైనేజీ అవుట్ లెట్‌ల సామర్థ్యం

జవహర్‌నగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని దాదాపు అన్ని కాలనీలు బురదమయంగా మారాయి. భవిష్యత్‌లో మరింత భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనంటూ ముంపు ప్రాంతాల ప్రజలు సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని పలువురు తమ ఇళ్లను ఖాళీ చేసి పొరుగిళ్లలో తలదాచుకునే పరిస్థితి ఏర్పడింది. గడిచిన పది సంవత్సరాలుగా ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని పాలకులు, అధికారులు హామీ ఇస్తూనే ఉన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అనుకున్న వేగంగా పనులు కొనసాగడంలేదు.

- గతేడాది జవహర్‌నగర్ పరిధిలోని లక్ష్మీనర్సింహ కాలనీ, సుక్కమ్మకుంట, కేసీఆర్‌నగర్, పాపయ్యనగర్, ఎన్‌టీఆర్ నగర్, కేసీఆర్ నగర్ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. అవే వర్షాలు మళ్లీ కురిస్తే ఈ సంవత్సరం కూడా మునిగిపోయే ప్రమాదం



వర్షాలకు జవహర్‌నగర్‌లో నీట మునిగిన ఇళ్లలో ఇబ్బందిపడుతున్న ప్రజలు (ఫైల్)

ఉంది. ఇకనైనానా అధికారులు మేల్కొని వేగంగా పనులు చేపట్టాల్సి ఉంది.

ఈ కాలనీలు జలమయం...

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో దాదాపు 60 వేల ఇళ్లు ఉన్నాయి. 2 లక్షలకు పైగా జనాభా ఉంది. కార్పొరేషన్ పరిధిలోని 2, 3, 7, 8, 19, 20, 28వ డివిజన్లలో ఎక్కువ జనాభా ఉంటోంది.

- ఈ డివిజన్ల పరిధిలో సుమారు 20 కాలనీలు ఏటా వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతున్నాయి. ఈ ప్రాంతంలో దాదాపు 40 వేల మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- గతేడాది పలు ఇళ్లలోకి చేరిన నీరు బయటకు తీయడానికి జిల్లా అధికారులతో పాటు ప్రత్యేక బృందాలు పని చేయాల్సి రావడం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు నిదర్శనం.

ముంపునకు కారణాలివీ...

కార్పొరేషన్‌లో అక్రమ వెంచర్లు తమ ఇష్టారీతిన రూపొందించి పేదలకు విక్రయించారు. కేవలం 15, 20 ఫీట్ల రోడ్లు మాత్రమే ఉన్నాయి. మరికొన్ని చోట్ల రోడ్డుకు అడ్డంగా ఉన్న స్థలాలను అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలను చేపట్టారు. దీంతో వరదనీరు వెళ్లడానికి దారులు మూసుకుపోవడంతో వరదనీరు ఇళ్లలోకి చేరుకుంటుంది.

వర్షం కురిస్తే నరకయాతనే...



హాయిగా ఇంట్లో ఉండి సేద తీరాలనుకుని ఇళ్లు కట్టుకున్నాం. కానీ వర్షం పడితే చాలు నరకయాతన పడాల్సి వస్తుంది. రోడ్లు, కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణం చర్యలు తీసుకుని మా కాలనీపై దృష్టి సారించాలి.

– బాషిపాక మహేందర్, లక్ష్మీనర్సింహకాలనీ

చుక్కనీటినీ ఆగనివ్వం



ప్రస్తుతం కాలువలలో ఎలాంటి చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. స్టామ్ వాటర్ డ్రైనేజీ కోసం నిధులను రప్పించే ప్రయత్నంలో ఉన్నాం. వీలైనంత త్వరగా మంజూరు అవుతాయి. మొదట ముంపు ప్రాంతాల నుంచి పనులు ప్రారంభిస్తాం.

– శాంతి కోటేష్‌గౌడ్, జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్

మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం

నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులోని విజయపురి కాలనీలో సుమారు రూ. 11 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో పెద్ద ఎత్తున మున్సిపల్ నిధులను వెచ్చించి సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, వీధి దీపాల ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని నిధులను వెచ్చించి అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ కొమురవెళ్లి అనితా సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించండి

ఘట్‌కేసర్: పట్టణంలోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించాలని చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. ఆరో వార్డులో కమిషనర్ సాబేర్ అలీతో కలిసి చైర్‌పర్సన్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రోడ్డుపై వ్యాపారం నిర్వహించే చిరు వ్యాపారులు తమ తోపుడు బండ్లను వెనక్కు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సిలర్ రవీందర్, జంగయ్యయాదవ్, ప్రేమ్‌కుమార్, సిరాజ్, కరుణాకర్‌యాదవ్, విక్రాంత్‌రెడ్డి, సలీం, మారుతి, శ్రీనివాస్, రాజీవ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో పరేషాన్

మేడ్చల్‌రూరల్: అప్రకటిత విద్యుత్ కోతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. చినుకు పడినా, చిన్నపాటి గాలులు వీచినా విద్యుత్ సిబ్బంది కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియక, ఇంట్లో పనులు చేసుకోలేక సతమతం అవుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిత్యం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. పూడూర్ గ్రామంలో మూడు రోజులుగా విద్యుత్ అంతరాయంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. సాంకేతిక లోపం కారణంగా మరోవైపు పలు చోట్ల విద్యుత్ తీగలకు చెట్లు ఆనుకొని ఉండటంతో సరఫరాలో అంతరాయం కలుగుతున్నది. విద్యుత్ సిబ్బందికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలాల వద్ద అప్రమత్తంగా ఉండండి



కీసర: వర్షాల నేపథ్యంలో నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి చౌరస్తా సమీపంలోని బీఎంఆర్ ఎన్‌క్లేవ్ వద్ద గల నాలతోపాటు, రాంపల్లి–చర్లపల్లి రహదారిలోని నాలాలను మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ పరిశీలించారు. భారీ వర్షాలు కురిసే సమయాల్లో నాలాల సమీపం గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాల నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నైపుణ్యాలతోనే పారిశ్రామిక రంగంలో రాణింపు



సావనీర్‌ను విడుదల చేస్తున్న అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు

లక్డీకాపూల్: పారిశ్రామిక రంగంలో నైపుణ్యాలను అందిపుచ్చుకుంటేనే రాణిస్తారని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం స్థానిక విశ్వ విశ్వాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ (వీవీఐఎస్ఎం)లో 'వారధి' పీజీడీఎం బ్యాచ్ 2024–2026 ప్రారంభోత్సవ వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేయడంలో విశ్వ విశ్వాని చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. బిజినెస్ స్టాండర్డ్ సీఓఓ సచిన్ ఫన్సికర్, అపోలో హెల్త్ అండ్ లైఫ్ స్టైల్ లిమిటెడ్‌లో లెర్నింగ్ అండ్ ఆర్గనైజేషనల్ డెవలప్‌మెంట్ హెడ్ ఎల్లన్ నాథన్, వీవీఐఎస్ఎం గ్రూప్ ప్రెసిడెంట్ జీఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ వై.లక్ష్మణ్‌కుమార్, అసోసియేట్ డీన్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు: ఒకరికి గాయాలు

ఘట్‌కేసర్: బైకును కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఘట్‌కేసర్‌లోని బుగ్గబావి వద్ద నివసిస్తున్న కార్ మెకానిక్ పోచని శ్రీనివాస్(29) బుధవారం బైక్ మీద ఘట్‌కేసర్ వస్తుండగా ఇండేన్ గ్యాస్ గోదాం దగ్గర కారు ఢీకొట్టింది. దీంతో అతని కాలు విరిగడంతో పాటు ఛాతీ భాగంలో గాయాలు తగిలాయి. బాధితుడిని చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో కొత్తపేటలోని ఓమ్ని హాస్పిటల్‌కు తరలించారు. గురువారం బాధితుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

పిస్తాహౌస్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భోజనం



పిస్తా హౌస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు

శామీర్‌పేట్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు మేడిగడ్డ సందర్శనకు వెళ్లిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బుధవారం మధ్యాహ్నం మార్గ మధ్యంలోని అలియాబాద్ చౌరస్తాలో ఉన్న పిస్తాహౌస్ వద్ద ఆగి భోజనం చేసి వెళ్లారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గంలోని పలువురు నాయకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలను కలిశారు. కేటీఆర్ వెంట స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్ రెడ్డి, సునీతలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, శంభీపూర్ రాజు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం

మేడ్చల్: కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలకు ఆ పార్టీ మండల నాయకులు శామీర్‌పేట్‌లో ఘన స్వాగతం పలికారు. మండల, మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు శామీర్‌పేట్ మండలం అలియాబాద్ చౌరస్తా వద్దకు తరలి వెళ్లి తమ పార్టీ నాయకులకు, ఎమ్మెల్యేలకు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు సబితారెడ్డి, మల్లారెడ్డి తదితరులకు స్వాగతం పలికి వారి వెంట తరలివెళ్లారు. మండల నాయకులు భాస్కర్ యాదవ్, దయానంద్ యాదవ్, శంకర్, రవి కిషోర్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో కంప్యూటర్ విభాగాన్ని ఏర్పాటు చేస్తాం

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ సందర్శించారు. దాతలు అందజేసిన ఫర్నిచర్‌ను ఆయన గ్రంథాలయానికి అందజేశారు. పాఠకుల కోసం దాతలు ముందుకు వచ్చి ఫర్నీచర్ అందజేయం అభినందనీయమని అన్నారు. జిల్లా గ్రంథాలయంలో త్వరలో ప్రత్యేకంగా కంప్యూటర్ విభాగాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ఆయన కాసేపు ముచ్చటించారు. గ్రంథాలయ సిబ్బంది, కాంగ్రెస్ నాయకుడు పంజగారి ఆంజనేయులు పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

పోచారం: బాలలచే భవన నిర్మాణ పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్‌పై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం... చౌదరిగూడ గ్రామ పరిధిలోని డాక్టర్స్ కాలనీలో ఇద్దరు బాలలు భవన నిర్మాణ పనులు చేస్తుండగా ఆశ్రయ్ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ దనవాడ రమేష్(25) చూశారు. బాలలతో ఆయన మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉప్పల్‌లో ఉంటున్న బండి ఉదయ్ కుమార్(16), మేడిపల్లిలోని సాయిప్రియ కాలనీకి చెందిన మల్లెల శాంతి వర్ధన్(14)గా వారిని గుర్తించారు. వీరు ఏపీలోని ప్రకాశం జిల్లా నుండి వచ్చి తన్నీరు దానయ్య(40) వద్ద భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. రోజుకు ఒక్కొక్కరు రూ. 600 కూలి చెల్లిస్తున్నాడు. చట్టవిరుద్ధంగా పనులు చేయిస్తున్న దానయ్యపై కేసు నమోదు చేయించి, బాలలకు పనుల నుండి విముక్తి కల్పించారు.

పింఛన్ కోసం పడిగాపులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పింఛన్ సమయానికి రాకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు పోస్టాఫీస్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా... మరికొందరు కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. గురువారం లబ్ధిదారులు కార్యాలయం వద్ద పింఛన్ కోసం నిరీక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పింఛన్ పెంచుతామని చెప్పి ఉన్న పింఛన్ కూడా సమయానికి ఇవ్వడం లేదని బీఆర్ఎస్ కౌన్సిలర్ హేమంత్‌రెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారంటీ పథకాల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ మొత్తాన్ని పెంచి సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలన్నారు. లేని పక్షంలో వారి బ్యాంకు ఖాతాలో జమచేయాలని డిమాండ్ ఆయన చేశారు.

బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

పోచారం: బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద వరంగల్ నుంచి అతివేగంగా వస్తున్న ప్రైవేట్ బస్సు ఓ వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి వెనక టైర్ల కింద పడి నుజ్జునుజ్జు కావడంతో మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంగరంగ వైభవంగా బోనాలు



బోనాలతో మహిళా కండక్టర్లు



ఎస్ఎస్‌జీ స్కూల్ విద్యార్థులు...

మేడ్చల్: పట్టణంలోని కిందిబస్తీలో బోనాల పండగను ప్రజలు గురువారం వైభవంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నల్లపోచమ్మ ఆలయం వద్ద బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. మహిళలు బోనాలను ఇళ్లలలో తయారు చేసి ఊరేగింపులతో అమ్మవారికి సమర్పించారు. సంప్రదాయబద్ధంగా పండగను చేసుకున్నారు. పోతరాజుల నృత్యాలు, శివసత్తుల శిగాలతో బోనాల జాతర శోభాయమానంగా జరిగింది. పట్టణంలో అన్ని పార్టీల నాయకులు, ప్రముఖులు అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

మేడ్చల్ ఆర్టీసీ డిపోలో...

మేడ్చల్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డిపో సిబ్బంది, మహిళా కండక్టర్లు బోనాల పండగను ఘనంగా జరుపుకున్నారు. మహిళా కండక్టర్లు డిపో ఆవరణలో బోనాలను తయారు చేసి ఆడిపాడి అమ్మవారికి సమర్పించారు. సిబ్బంది, అధికారులు అందరూ కలిసి పండగను ఘనంగా జరుకొన్నారు. కార్యక్రమంలో డీఎం సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ రామారావు, ఏఈ స్నేహలత పాల్గొన్నారు.

ఎస్ఎస్‌జీ స్కూల్‌లో...

ఎస్ఎస్‌జీ స్కూల్‌లో బోనాల సంబురాలను చిన్నారులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సాయంతో బోనాలను తయారు చేశారు. విద్యార్థినులు చీరకట్టుతో బోనాలను ఊరేగించారు. పోతరాజుల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ, మాజీ జెడ్పీటీసీ శైలజహరినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.